ప్రజాశక్తి

శనివారం 20 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

సీఎం సారూ.. చిరకాల స్వప్నం..

చేస్తారా.. సాకారం..!



వరికపూడిసెల నిర్మాణం చేపట్టాల్సి ప్రాంతం

ప్రజాశక్తి - మాచర్ల

1952 నాగార్జున సాగర్ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ప్రభుత్వం కోస్లా కమిటీని నియమించి ప్రాజెక్టు వలన ఒనగూడె ప్రయోజనాలు, నష్టాలను అంచనా వేయమంది. రిజర్వాయర్ నిర్మాణం జరిగే వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలాల్లో వర్షపాతం తగ్గి, తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడుతుందని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కమిటి నీవేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో వెల్దుర్తి మండలంలో వరికపూడిసెల ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి, సాగర్ రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తిపోసి ఆయా మండలాలకు సాగు, తాగు నీటిని అందివ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంల హోదాలో శంఖుస్థాపనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. సిఎం చంద్రబాబు ఇటీవల సమీక్షించి రూ.340.26 కోట్లతో తొలిదశ పనులు చేపట్టి 24,900 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు దశల్లో రూ.2200 కోట్లతో పనులు చేసి

▶ 2లో

సిఎం పర్యటన ఇలా..

ఉదయం 10.30 గంటలకు మాచర్ల సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ వద్దకు హెలికాప్టర్‌లో సిఎం చేరుకుంటారు. 10.45 గంటల వరకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలుకుతారు. 11.05 గంటల వరకు 23వ వార్డు, యాదవ బజారులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొంటారు. 11.10 గంటల నుండి 11.28 గంటల వరకు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద సఫాయి కార్మికులు, వైద్య సిబ్బందితో మాట్లాడి స్వచ్ఛత రథాన్ని ప్రారంభిస్తారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావేదిక వద్ద ఉన్న స్టాల్స్‌ను సందర్శిస్తారు. స్వయం సహాయ సంఘాలకు రూ.2 కోట్ల రుణ చెక్కును అందిస్తారు. అనంతరం వేదిక నుంచి ప్రసంగిస్తారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో మాట్లాడతారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన మున్సిపల్ కమిషనర్లు, వివిధ పాఠశాలల ప్రతినిధులను సన్మానిస్తారు. మధ్యాహ్నం అనంతరం 2.05 గంటల నుంచి 3.35 గంటల వరకు ఆటో నగర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో టిడిపి శ్రేణులతో సమావేశమవుతారు. 3.40 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 23వ వార్డు యాదవ బజారులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. 4.10 గంటలకు బయలుదేరి 5 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన మాచర్లలో ప్రజలు దశాబ్దాలుగా సమస్యలతో సతమతమవుతున్నారు. ఎప్పుడో ఏర్పాటు చేసిన కెసిపి సిమెంట్స్, ఆ తరువాత వచ్చిన శ్రీచక్ర, పరాశక్తి సిమెంట్స్ ఫ్యాక్టరీలు మినహా పారిశ్రామికాభివృద్ధికి నోచలేదు. సాగునీరు, తాగు నీరందించే ఎత్తిపోతల పథకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. అత్యవసర వైద్యానికి 100 కిలోమీటర్లు పోవాల్సిందే. అదిగో.. ఇదిగో అంటున్న 100 పడకల అసుపత్రి కార్యరూపం దాల్చటం లేదు. పీజీ (పోస్టు గ్రాడ్యుయేషన్) సెంటర్ ఏర్పాటుకూ గతిలేదు. పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. టూరిజం ప్రాజెక్టు ఎప్పుడు సాకారం అవుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు మాచర్లకు వస్తున్న నేపథ్యంలో ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



యాత్రను ప్రారంభిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, ఎన్.వెంకటేశ్వర్లు

బోధనేతర పనులు వద్దు

- యుటిఎఫ్ రణభేరి జాతాలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- 25న గుంటూరులో రాష్ట్ర సభ

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువగా బోధనేతర పనులు అప్పగిస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రణభేరి యాత్ర శుక్రవారం గుంటూరుకు చేరుకుంది. గుంటూరులో యాత్రను కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు బ్రాడీపేటలోని సంఘ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఉపాధ్యాయ ఉద్యమ నేత చెన్నుపాటి లక్ష్మయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 6 రకాలుగా స్కూళ్లను విభజిస్తే ఈ ప్రభుత్వం 9 రకాలుగా విభజించిందని, దీంతో 19 వేలు బేసిక్ స్కూల్స్ ఏర్పడ్డాయని, వాటిల్లో ఎక్కువగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, అవన్నీ మూతపడే ప్రమాదం ఉందని వివరించారు. 12వ పిఆర్‌సి కమిటీ గడువు రెండేళ్లు దాటినా ఏర్పాటు చేయలేదని, వెంటనే కమిషన్ చైర్మన్‌ను నియమించాలని, ఈలోగా 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.22 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి విద్యార్థులను తయారు చేస్తామని ప్రపంచ బ్యాంకు నుండి రూ.1860 కోట్లు అప్పు తెచ్చుకొని, సాల్ట్ పథకాన్ని అమలు చేస్తున్నారని, దాని కోసం ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారని విమర్శించారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో 32.46 లక్షల మంది విద్యార్థులుంటే ఈ ఏడాది 29.31 లక్షలకు తగ్గారని, సాల్ట్ వల్ల ఏం ఒరిగిందో ప్రభుత్వం చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు మాత్రం బోధనకు దూరం అవుతున్నారన్నారు. విద్యారంగానికి గత బడ్జెట్‌లో 11 శాతం కేటాయిస్తే ఈ ఏడాది 9.8 శాతానికి తగ్గించారన్నారు.

▶ 2లో



భూమి, నిధులు ప్రభుత్వానివి.. పెత్తనం ప్రైవేటుకా..?

- వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి
- పూర్తి చేసేందుకు నిధులను సత్వరం విడుదల చేయాలి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- బ్రహ్మణపల్లిలో నిర్మాణాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి అందని ద్రాక్షలా ఉన్న వైద్యవిద్య, వైద్యాన్ని ప్రైవేటుపరం చేయటం దుర్మార్గమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిర్మాణంలో ఉన్న పల్నాడు మెడికల్ కళాశాలను సిపిఎం బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పల్నాడు ప్రజలకు చిరకాల కోరిక మెడికల్ కళాశాల అని, గత ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రూ.500 కోట్లతో ప్రారంభించిందని చెప్పారు. అయితే ఇప్పటి వరకు సుమారు రూ.230 కోట్ల పైగా ఖర్చు చేసినట్లు స్థానిక అధికారులు చెప్పారని, 2025 డిసెంబర్ నాటికి వైద్యశాల పూర్తి చేస్తామంటున్నారని, ప్రభుత్వం నిధులు త్వరగా విడుదల చేస్తేనే ఇది

▶ 2లో



▶ 4లో

పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌లో వైసిపి శ్రేణులు

వైద్య కళాశాలలకు వెళ్లకుండా అడ్డగింత

- నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి గృహ నిర్బంధం
- వైసిపి శ్రేణులను ఎక్కడికక్కడ నిలువరించిన పోలీసులు

చిన్నారి విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

వృద్ధునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యార్థినుల పట్ల దారుణంగా వ్యవహరించాడని తల్లిదండ్రుల ఫిర్యాదుతో వృద్ధునిపై ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. దీనిపై పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండగా అనారోగ్యం కారణంగా హెచ్‌ఎం కొద్దిరోజులుగా సెలవులో ఉన్నారు. దీంతో మరో

▶ 2లో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు పాశం రామారావు, ఎన్ భావన్నారాయణ తదితరులు

27న జాషువా జయంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో జాషువా 130వ జయంతి సభ నిర్వహిస్తున్న జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని శుక్రవారం బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో అవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా జాషువా సాహిత్య పురస్కారాన్ని.. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఇస్తున్నామని, ఈ ఏడాది ప్రముఖ సాహితీవేత్త, విశ్లేషకులు తెలకపల్లి రవికి ప్రదానం చేయనున్నామని తెలిపారు. జాషువా తన జీవితాంతం కులవివక్ష, అంటరానితనం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు దాటినా నేటికీ సమాజంలో కుల వివక్ష, అంటరానితనం, దళితులు, బలహీన వర్గాలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా జాషువా స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎన్.భావన్నారాయణ మాట్లాడుతూ 27న జరిగే సభలో ముఖ్య వక్తలుగా మాజీ ఎమ్మెల్సీలు ఎంవిఎస్.శర్మ, కెఎస్.లక్ష్మణరావు, ఎసి కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం ప్రసంగిస్తారని

▶ 2లో

బోధనేతర పనులు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

యోగాంధ్ర, ప్రణాళిక లేని శిక్షణ, పిటిఎం వంటి రకరకాల పేర్లతో బోధనేతర కార్యక్రమాలు పెంచారని మండిపడ్డారు. సెల్‌ఫోన్ లేని బడి కావాలని కోరారు. ప్రభుత్వం సమస్యలపై స్పందించకపోతే మరో బిఆర్‌టిఎస్ రోడ్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈనెల 25న గుంటూరులో జరిగే ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంత రావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

27న జాషువా జయంతి సభ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 21న పద్యపఠన పోటీలు సీనియర్, జూనియర్ విభాగంలో బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వై.కృష్ణకాంత్, ఎస్‌కె.సమీర్ పాల్గొన్నారు.

వృద్ధునిపై పోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయిని అన్ని తరగతుల విద్యార్థులనూ ఒకే గదిలో ఉంచి పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇదే పాఠశాలలో శానిటేషన్ వర్కర్‌గా వాసిమళ్ల నాగమ్మ 12 ఏళ్ల నుండి పని చేస్తున్నారు. అయితే విధులు మాత్రం ఆమె భర్త సామియేలు నిరవహిస్తుంటారు. ఈ క్రమంలో విద్యార్థులు మరో గదిలో ఉన్న నీటిని తాగేందుకు వెళ్లి వస్తున్న సందర్భంలో ముగ్గురు చిన్నారుల సామియేలు అసభ్యకరంగా ప్రవర్తించాడు. పిల్లలకు తల్లులు స్నానం చేయించేటప్పుడు నొప్పిగా ఉందని చెప్పడంతో ఆరా తీయగా అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో వారు గురువారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను నిలదీశారు. అదేరోజు విధుల్లోకి వచ్చిన హెచ్ఎం వారితో మాట్లాడి నిందితుడు సామియేలును పిలిపించే ప్రయత్నం చేయగా అక్కడి నుండి సామియేలు పరారయ్యాడు. దీంతో తల్లిదండ్రులు గురువారం రాత్రి ప్రత్తిపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి బాధిత పిల్లలను వైద్య పరీక్షలకు పంపారు. ఇదిలా ఉండగా ఈ విషయమై డిఇఒ ఆదేశాల మేరకు ఎంఇఒ విచారణ చేపట్టి నివేదించారు.

భూమి, నిధులు ప్రభుత్వానివి.. పెత్తనం ప్రైవేటుకా..?

(మొదటి పేజీ తరువాయి)

సాధ్యమవుతుందని అన్నారు. దానికిబదులుగా పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటుకు అప్పజెప్పి ఆలోచనలో ప్రభుత్వం ఉందని, వైద్య కళాశాల నిర్మిస్తున్న భూమి, నిధులు మొత్తం ప్రభుత్వానివి కాగా ప్రైవేటు పెత్తనం ఏమిటని నిలదీశారు. రాష్ట్రంలో 4 వైద్య కళాశాలలను పిపిపికి అప్పజెబుతున్నారని, బ్రాహ్మణపల్లి కాలేజీ ఆ విధానంలో లేదని, విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక అప్పజెప్పరనే గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజల ఆస్తి అని, ప్రజల చేతుల్లోనే ఉండాలని అన్నారు. విద్య, వైద్యం కోసం ప్రజలంతా అప్పులు చేసి ఖర్చు పెడుతున్న క్రమంలో పల్నాడు మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నడపాలని, అందుకవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు టి.శ్రీనివాసరావు, పోతురాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -గుంటూరు : స్థానిక ఏటిగ్రహారంలోని శ్రీవిజేత హైస్కూల్లో ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అప్సా రాష్ట్ర, జిల్లా సమావేశం నిర్వహించారు. అసోసి యేషన్ ట్రెజరర్ చెరుకూరి శ్రీహరి సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రస్థాయి అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లకు కరెంటు చార్జీలుతగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులను సన్మానించారు. స్టేట్ కౌన్సిల్ చైర్మన్ రాము, మేకల రవీంద్రబాబు, రవిచంద్రరెడ్డి, వి. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు మురళి, భాను స్కూల్ డైరెక్టర్లు ప్రసంగించారు.

చేస్తారా.. సాకారం..!

(మొదటి పేజీ తరువాయి)

80 వేల ఎకరాలకు నీరు అందివ్వాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. వీటికి త్వరగా కార్యరూపం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తీవ్ర సమస్యగా వుంది. మాచర్ల పట్టణానికి 1962లో అప్పటి జనాభాకు 15 వేలుకు తగ్గట్టుగా రూపొందిన తాగునీటి పథకమే నేటికీ కొనసాగుతోంది. బుగ్గవాగు రిజర్వాయర్ నుండి మాచర్ల పట్టణానికి తాగునీరివ్వాలనే పథకం ఎప్పటి నుంచో ముందుకు సాగటం లేదు. తాజాగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ద్వారా నీరు అందిస్తానని చెబుతోంది. ఆ పనులనూ త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పీజీ సెంటర్ రాదు.. ఉపాధ్యాయులుండరు..

పల్నాడు ప్రాంతంలో పేదల జీవితాలు విద్యావెలుగులు వెలిగించిన కళాశాల శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ కళాశాల. ఈ కళాశాలలో పిజి సెంటర్ ఏర్పాటు చేయాలని దశాబ్దాల డిమాండ్ రాజకీయ హామీలకే పరిమితమైంది. ఈ ప్రాంత విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి, పోస్టు గ్రాడ్యుయేషన్ చేయటానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం భారంగా మారుతోంది. పిజీ సెంటర్ ఏర్పాటుకు కావాల్సిన భూమి ఎస్‌కెబీఆర్ కళాశాలలో అందుబాటులో ఉన్నా చర్యలు మాత్రం లేవు.

నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత తీరని సమస్యగా వుంది. ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురుతో నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీల సమయంలో వున్న కొద్ది మంది ఉపాధ్యాయులు కూడా ఇక్కడి నుండి వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. మాచర్ల ప్రాంతానికి మాత్రం ఎవరూ రావటానికి మొగ్గుచూపటం లేదు. ఈ సమస్యనూ పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



100 పడకలు ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరిగినా, గుండె పోటు, పక్షవాతం వంటి వాటికి గురై ప్రాణాపాయ పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు కావాలంటే 100 కిలో మీటర్లు పోవాల్సిందే. ఈ సమయంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నియోజకవర్గంలోని 100 గ్రామాలకు సేవలందించే పెద్ద ఆసుపత్రి మాచర్ల ప్రభుత్వ వైద్యశాల. పేద ప్రజలు అధికంగా వుండే ఈ ప్రాంతం వారికి ఈ ఆసుపత్రే పెద్దదిక్కు. ఈ ప్రాంతవాసుల వైద్య అవసరాలకు తగ్గట్టుగా ఆసుపత్రిలో సేవలు అందుబాటులో లేవు. ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రి స్థాయికి పెంచి, కార్డియాలజిస్ట్ (గుండె వైద్యుడు)ను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుండో వున్న డిమాండ్. నేటి పర్యటనలో ఆసుపత్రి స్థాయిని పెంచే ప్రకటన సిఎం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టూరిజం ప్రాజక్టుతో అభివృద్ధి, ఉపాధి..

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ వద్ద టూరిజయం పార్కును ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగి, ఇక్కడి వారికి కొన్ని ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. సాగర్‌లో మెగా టూరిజయం పార్కు ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుండి ప్రభుత్వాలు ప్రణాళికలు వేస్తూన్నా కార్యరూపం దాల్చటం లేదు. ఇందుకు తగిన భూములు కూడా అందుబాటులో వున్నాయి. దానిలోనే మినీ విమానాశ్రయం కూడా వుంది. ఇప్పటికే పలు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఇక్కడి భూములు పరిశీలించినా ప్రాజెక్టు ఏర్పాటు అడుగు ముందుకు పడలేదు. ఈ ప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చే మెగా టూరిజయం పార్కు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసుల కోరిక.

పారిశ్రామిక పురోగతికి చేయూతనివ్వాలి.

పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలున్నా జరటం లేదు. గతంలో దుర్గి, మాచర్లలో ప్రభుత్వం కార్పోరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన లెదర్ పార్కులు మూతపడ్డాయి. ఇటీవల కాలంలో లెదర్ పరిశ్రమలు ఏర్పాటుకు విదేశీ ప్రతినిధులు ఈ ప్రాంత భూములను పరిశీలించినా పురోగతేమీ లేదు. మౌలిక సదుపాయాలు కల్పించి, ఈ ప్రాంతంలో పారిశ్రామిక పురోగతికి ప్రభుత్వం చేయూతనివ్వాలని స్థానికులు కోరుతున్నారు. వీటన్నింటిపై సిఎం ఏమైనా వరాలు ప్రకటిస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి.. 1142 మందితో బందోబస్తు..

ప్రజాశక్తి-మాచర్ల, పల్నాడు జిల్లా

ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిఎం చంద్రబాబు శనివారం మాచర్లకు రానున్న నేపథ్యంలో సభ, బందోబస్తు ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. హెలిపాడ్ గ్రౌండ్‌ను, యాదవుల బజారులో స్వచ్ఛాంధ్ర జరిగే ప్రదేశం, ఆర్టీసీ గ్యారేజీ దగ్గర ఏర్పాటు చేసిన సఫాయి మిత్ర సురక్షా సివిర్/హెల్త్ క్యాంప్, మీటింగ్, పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి ట్రైలరన్ నిర్వహించారు. మాచర్ల వివిఎన్ గార్డెన్స్‌లో పోలీసు అధికారులకు సిబ్బందితో ఎస్పీ సమావేశమై దిశానిర్దేశం చేశారు. నలుగురు ఎఎస్‌పిలు, 10 మంది డిఎస్‌పిలు, 37 మంది సిఐలు, 64 మంది ఎస్ఐలు, 290 మంది ఎఎస్ఐలు, 451 మంది కానిస్టేబుళ్లు, 286 మంది హోం గార్డులు, మొత్తం 1142 మందితో పాటు ఒక స్పెషల్ పార్టీతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌లు, కెమెరాలతో పటిష్ట నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌పి జెవి.సంతోష్, ఎఆర్ అదనపు ఎస్‌పి సత్తిరాజు, గురజాల డిఎస్‌పి జగదీష్, ఎస్‌బి-1, 2 సిఐలు బి.సురేష్‌బాబు, పి.శరత్‌బాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సభా వేదిక

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వాగ్దేవి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 17 న కాజీపాలెం లోని డాక్టర్ డియస్. రాజు జూనియర్ కళాశాలలో అండర్ -19 ఎస్జిఎఫ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఎంపికలలో స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన 34 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహించగా 15 మంది స్టేట్ టీమ్ కు సెలక్ట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బాలుర విభాగంలో జి. వెంకట నాగరాజు షాట్ పుట్ లో మొదటి, డిస్కస్ త్రో రెండవ, ఎమ్. అజయ్ 800మీ రన్నింగ్ లో మొదటి, ఎమ్. లీలా సంపత్ జావలిన్ త్రోలో మొదటి, టి. హరిష్ జావలిన్ త్రో, షాట్పుట్ లో రెండవ, జి. మనికంఠ లాంగ్ జంప్ లో మూడు, వి. విష్ణు సాయిరాం డిస్కస్ త్రోలో రెండవ, కె. మనికంఠ హెమర్ త్రోలో మూడవ, యు. శ్రీకాంత్ 100మీ రెండవ, 1500 మీ మూడవ, కె.శ్రీనివాస్ 400మీ రన్నింగ్ మూడవ, ఆర్. దుర్గా ప్రసాద్ నాయక్ 800మీ రన్నింగ్ మూడవ స్థానాల్లో నిలువగా, బాలికల విభాగంలో యు. ప్రవళిక 800మీ మొదటి, కె. లక్ష్మి సరిత షాట్పుట్ లో రెండవ, జి. రిషి 400మీ రెండవ, టి. రామాంజలి 200మీ రెండవ, కె. సౌమ్య 400మీ మూడవ స్థానంలో నిలిచారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. స్టేట్ మీట్ కు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23, 24, 25 తేదీలలో పశ్చిమ గోదావరిలో జరగనున్న స్టేట్ మీట్ కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామ కోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కష్ణారావు, పి.వి అచ్యుతరావు ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు విద్యార్థులను అభినందించారు.



ప్రమాద భరితంగా విద్యుత్ వైర్లు...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో విద్యుత్ వైర్లు పలుచోట్ల ప్రమాదపరితంగా మారాయి. ఇటీవల స్టేషన్ రోడ్ లో కొన్ని గుహాలలో వైర్లు కాలిపోయాయి. అదేవిధంగా మంగళగిరి ప్రముఖ పారిశ్రామికవేత్త నన్నపనేని నాగేశ్వరరావు రాయల్ కన్వెన్సీ, రాయల్ బంక్వెట్, తన నివాసంలో స్టెబిలైజర్స్, లైట్లు కాలిపోయాయని తెలిపారు. కరెంటు ఆపినప్పటికీ కాలిపోయాయని తెలిపారు. అదేవిధంగా రాయల్ కన్వెన్షన్ వద్ద 100 మీటర్లు వైర్లలో 30 గంట్లు ఉన్నాయని తెలిపారు. దీనిపై విద్యుత్ అధికారులకు తెలియజేయగా సిబ్బంది కొరత ఉందని చెప్పినట్లుగా ఆయన తెలిపారు. మొత్తంగా మూడు చోట్ల కలిపి లక్ష రూపాయలు నష్టం జరిగినట్లుగా ఆయన తెలిపారు. హై వోల్టేజ్ కారణంగా జరిగి ఉండవచ్చునని తెలిపారు అదేవిధంగా ఇటీవల వినాయక చవితి పండుగ సందర్భంగా ఉచితంగా కరెంటు ఇవ్వడం వలన లైన్ల మీద వేయడం వలన ఈ విధంగా జరిగిందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉచితంగా వచ్చిందని కిలోమీటర్ల దూరంలో లైటింగ్ ల వేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం సబబు కాదని అన్నారు. మరల దసరా వస్తుందని ఈ పండక్కి కూడా అదే విధంగా జరిగితే విద్యుత్ వినియోగదారులకు నష్టం కలిగే అవకాశం ఉందని ప్రభుత్వం, విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



హై వోల్టేజ్ తో దద్దమైన కరెంటు వైర్లు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

శాంతి నగర్‌లో ఫ్రై డే.. డ్రై డే

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పినపాడు శాంతినగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటిని సందర్శించి దోమల లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు ఇంటింటికి పంచారు సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యమని, ప్రజలు ఎక్కడా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎస్ ఉమాకాంత్, సిబ్బంది ఎ.బాలచంద్రమౌళి, వంగల పున్నారెడ్డి, డి.శ్రీనివాసరావు, షేక్ రషీద్, సయ్యద్ కరీముల్లా, తురుమెళ్ళనిర్మల, బి.హేమలత, ఆర్. వెంకటరమణ పాల్గొన్నారు.

ఎనిమిదవ పే కమిషన్‌ను నియమించాలి

ప్రజాశక్తి - తెనాలి

ఎనిమిదవ పే కమిషన్ను వెంటనే నియమించాలని ఎస్ సి ఆర్ ఎం యు తెనాలి శాఖ కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. ఎస్ సి ఆర్ ఎం యు, ఎఐఆర్ఎఫ్ పిలుపుమేరకు శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పే కమిషన్ ను నియమించడంలో ప్రభుత్వం తాత్సారం తగదని అన్నారు. తక్షణ చర్యలు తీసుకోకుంటే రైల్వే కార్మికుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న రైల్వే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

రాష్ట్రస్థాయిలో ఉన్న వీఆర్వోల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఏపీ డైరెక్టర్ రిక్రూట్మెంట్ రాష్ట్ర విఆర్ఓల సంఘం అధ్యక్షుడు ఎ. ప్రసన్న కుమార్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తమీమ్ అన్సారియాని కలిశారు. తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జివో నం.154 ప్రకారం విఆర్వో గ్రేడ్ 1 నుండి, సీనియర్ అసిస్టెంట్ లుగా ప్రమోషన్ పొంది, నిర్ణీత గడువు తేదీ లోగా డిపార్ట్మెంట్ టెస్ట్‌లు పాస్ కాని వారిని రివర్షన్ చేసి, తదుపరి సీనియారిటీ జాబితా లో ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించి జివో 154 ను అమలు చేయాలని అన్నారు. విఆర్వో గ్రేడ్ 2 నుండి, విఆర్వో గ్రేడ్ 1 లుగా ప్రమోషన్ లు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపి డైరెక్ట్ రిక్రూట్మెంట్ విఆర్వో ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్న కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.లూర్దురాజు, ఏపి డైరెక్ట్ రిక్రూట్మెంట్ విఆర్వో ల గ్రేడ్ 2 విఆర్వో ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటేష్, నాయకులు. అరుణ్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు..

పెద్ద ఎత్తున నగదు స్వాధీనం

ప్రజాశక్తి తెనాలి

పేకాడుతున్న బృందాన్ని డ్రోన్ సాయంతో రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్సై కె ఆనంద్ వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం సంఘం జాగర్లమూడి సంగమేశ్వర స్వామి గుడికి ఉత్తరం వైపున గల రైల్వే ట్రాక్ వద్ద ముళ్లకంపలలో పేకాడుతున్న బృందాన్ని డ్రోన్ సాయంతో పోలీసులు గుర్తించి దాడి చేశారు. ఘటనా స్థలంలో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 1,62,450 నగదు స్వాధీనం చేసుకుని, రెండు మోటార్ బైకులను సీజ్ చేశారు. ఆట నిర్వహిస్తున్న వడ్లమూడి గ్రామానికి చెందిన దుర్గ, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటనలో మొత్తం 17 మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాసమస్యలు పరిష్కరించాలని

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రజాసమస్యలు పరిష్కరించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సచివాలయ అధికారులకు శుక్రవారం మెమరాండం అందజేశారు. ఆత్మకూరు గ్రామంలోని ఇప్పటం రోడ్డులోని వైయస్సార్ కాలనీ నిమ్మగడ్డ రామ్మోహన రావు నగర్ వడ్డెరపాలెం పానకాల స్వామి నగర్ దీపిక వెంచర్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు మంగళగిరి వెళ్లడానికి ఆత్మకూరు ఇప్పటం రోడ్‌లోని సర్వీస్ రోడ్డు నుంచి వెళ్లారని ఆరోడ్డులో వెళ్లాలంటేనే భయమేస్తోందని వాపోయారు. కావున ఆ రహదారిని బాగు చేసి రోడ్డు, వీధిలైట్లు వేసి ఉపయోగపడే విధంగా చెయ్యగలరని సచివాలయ అధికారులకు మెమరాండం అందించారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, గడ్డం అజయ్ కుమార్, పండల ప్రసాద్ వుద్దంటి దుర్గారావు, తమ్మిశెట్టి రమణయ్య, గడ్డం సిద్ధార్థ, షేక్ ఈసుబ్ అలీ, వింజమూరి పైడ్రాజు, మునగాల ప్రదీప్, గొట్టిముక్కల రాజు, వాసుతదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో సురక్షిత గ్రామ జ్యోతి కార్యక్రమం

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మై ఛాయిసెస్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని యస్. అనురాధ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన ల్యాప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహహింస లేని గ్రామాలను "సురక్షిత గ్రామాలు" అంటారన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా కార్యదర్శులు మహాలక్ష్మి, రత్నకుమారి, ల్యాంప్ సంస్థ ప్రతినిధి టి మంగయ్య, ఉపాధ్యాయులు అమర్నాథ్, విద్యార్థులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటరమణ, అంగన్వాడీ కార్యకర్తలు ప్రమీల, అషిమూన్, స్వరూప, ప్రశాంతి, చింతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కామిక్ పుస్తకాలు పంపిణీ చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మంగళగిరి

ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ తెలిపింది. శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ సభ్యులు మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా ఇంటర్ నుంచి పోస్ట్ గ్రాడుయేషన్ వరకు చదువుకునే, చేనేత వర్గానికి చెందిన పేద విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు ఇతర ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా పథకాల కింద ప్రయోజనం పొందేందుకు దరఖాస్తులను ఈనెల 21వ తేదీ (ఆదివారం) నుంచి షరాఫ్ బజార్‌లోని మాస్టర్ వీవర్ అసోషియేషన్ బిల్డింగ్‌లో ఇవ్వనున్నట్లు సొసైటీ తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లు, అవసరమైన పత్రాలు జత చేసి వారం రోజుల లోపు తిరిగి అదే కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మురుగుడు హను మంత రావు, సెక్రటరీ ప్రగడ రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ గంజి రవీంద్ర నాథ్, కార్యదర్శి, ట్రెజరర్, తిరువీధుల రమణ మూర్తి, గౌరవ అధ్యక్షులు జొన్నాదుల బాబుజీ పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న సొసైటీ ప్రతినిధులు

ఘనంగా తాపి ధర్మారావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ రచయిత, హేతువాది తాపీ ధర్మారావు జయంతిని శుక్రవారం పట్టణానికి చెందిన సత్యం శివం సుందరం సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ వ్యవస్థాపకులు తన్నీరు శివ శంకర్ మాట్లాడుతూ తాపీ ధర్మారావు జయంతిని ప్రభుత్వం తెలుగు మాధ్యమాల దినోత్సవంగా ప్రకటించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. పట్టణానికి చెందిన పాత్రికేయుడు యం గోపీచంద్ కు తాపీ ధర్మారావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.రవికుమార్, పి.శ్రీనివాసరావు, తన్నీరు కళ్యాణ్ కుమార్, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.హనుమంతరావు, ఆర్.ఉమా మహేశ్వరరావు, వి.భీమేశ్వరప్రసాద్, ఎన్.మణికంఠ, కె. విజయసారథి పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - మేడికొండూరు

పలకలూరు రోడ్‌లోను శ్రవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు 112 ఫోన్ కాల్ ద్వారా సమాచారం పోలీ సులకు తెలిపారు. గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు గ్రామానికి చెందిన చెన్నంశెట్టి గోవింద రాజులు(40)గా పోలీసులు గుర్తించారు. గోవిందరాజులు 18 తారీకు సాయంత్రం నుండి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి సూర్యనారాయణ పోలీసులకు తెలిపాడు. మద్యం తాగి ఎక్కడో పడుకొని ఉంటాడు అనుకున్నామని, వెతకలేదని తెలిపారు. ఎటువంటి కుటుంబ గొడవలు లేవు అని తెలిపారు. మేడికొండూరు సిఐ షేక్ నాగూర్ మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన గోవిందరాజులు

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం నందిగామ పంచాయతీ పరిధిలోని చెరుకూరి రాజశేఖర్ అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గతనెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాలేదని భార్య సుధ సత్తెనపల్లి రూరల్ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మల ఫార్మసీలో స్వచ్ఛతాహి సేవ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో, కమిషనర్ షేక్ అలీం బాషా సూచనల మేర కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ మరియు ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ-2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి ప్రారంభించారు. ర్యాలీ ఆత్మకూరు హైవే అండర్‌పాస్ వద్ద మానవహారంగా ఏర్పడి, విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ జోయల్, వి. జోజి బాబు, పి. తేజశ్రుతి ,ఎంటిఎంసి విభాగం నుండి ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, శానిటేషన్ సూపర్వైజర్ నజ్మా తదితరులు హాజరయ్యారు. దేశ ఆరోగ్య భద్రతను ధ్యేయంగా పెట్టుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల సత్ఫలితమైన భాగస్వామ్యాన్ని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవ. సిస్టర్ జి.నిర్మల జ్యోతి అభినందించారు.

ఏఐసిటిఇ ఎడ్యు స్కిల్స్‌లో కెఎల్‌యుకు ర్యాంకు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) 2025 సంవత్సరానికి అత్యుత్తమ ర్యాంకులను ప్రకటించింది. ఉన్నత విద్యలో అగ్రశ్రేణి సంస్థ అయిన కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, కెఎల్ హెచ్ హైదరాబాద్ క్యాంపస్ లు జాతీయ స్థాయిలో ఆలిండియా 4వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ ర్యాంకుతో పాటు ఎంతో ప్రతిష్టాత్మకమైన పలు అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా కెఎల్ స్కిల్ డెవలప్ మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కెఎల్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ,, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అన్నివిభాగాల డీన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



టైల్ పాండ్ ప్రాజెక్టుకు భారీగా వరద

పులిచింతలకు 2,58,179 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి వరద నీరు వస్తుండడంతో 20 గేట్లకు గాను 17 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి 2,58,179 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి 2,60,657 క్యూసెక్కులు వస్తోందని, రిజర్వాయర్లో 6.045 టీఎంసీల నీరు ఉందని ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపేశామన్నారు.



పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - రెంటచింతల

తమను పర్మినెంట్ చేయాలని సత్రశాలలోని నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన శుక్రవారం మూడోరోజుకు చేరింది. ప్రాజెక్టు మెయిన్ గేటు వద్ద తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అపరిమిత మెడికల్ పాలసీని అమలు చేయాలని, పదేళ్లు పూర్తి చేసి చేసినవారికి ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షులు ధర్మారావు, కార్యదర్శి సుగుణరావు, అమర్నాథ్‌రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

రేపు పల్నాడు జిల్లా సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి పట్టణంలోని విద్యా కేంద్రం డిగ్రీ కాలేజ్‌లో ఆదివారం జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్, పి.శివరామకృష్ణ శనివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డును తీసుకొని రావాలని చెప్పారు. ఎంపికైన వారు ఈ నెల 27,28 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, వివరాలకు 8712129398, 9985186556 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

ఎంపిడిఒగా ఉమాదేవి బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి - ఈపూరు



ఈపూరు ఎంపీడీవోగా ఎ.ఉమాదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉమాదేవి గతంలో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించి, మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఉమాదేవి చెప్పారు.

వైద్య కళాశాలలకు వెళ్లకుండా అడ్డగింత

నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి గృహ నిర్బంధం - వైసిపి శ్రేణులను ఎక్కడికక్కడ నిలువరించిన పోలీసులు





నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు.. సత్తెనపల్లిలో రహదారిపై వైసిపి శ్రేణుల ఆందోళన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పజెప్పడానికి వ్యతిరేకంగా వైసిపి శుక్రవారం చేపట్టిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలోని కాలేజీ వద్దకు వైసిపి శ్రేణులు వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతి లేదంటూ పట్టణ సిఐ వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. పలువుర్ని అదుపులోకి తీసుకుని పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ వద్ద తనను అడ్డుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి కుట్రలో భాగంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. ఎన్నిక కేసులు పెట్టినా పోరాడతామని, కాలేజీను ప్రైవేటుపరం కానివ్వబోమని అన్నారు. వైసిపి నాయకులు నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ స్వామి భక్తిని చాటుకునేందుకు చలో పిడుగురాళ్ల కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు. పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు అప్పచెప్పేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'చలో మెడికల్ కళాశాల'కు పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివసరెడ్డిని నరసరావుపేట పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆందోళనకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకోగా వారి తీరు అప్రజాస్వామికమని శ్రీనివాసరెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఇదిలా ఉండగా ఈ అంశంపై శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రతి విషయాన్ని వ్యాపార దక్పథంతో ఆలోచిస్తున్నారని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణమని విమర్శించారు. వైసిపి హయాంలో 17 వైద్య కళాశాలలను తీసుకొచ్చి వేలాది మంది పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు వీలు కల్పించామని, వీటిని ప్రైవేటీకరించడం ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నిందని అన్నారు. 5 కళాశాలలు పూర్తి చేసి తరగతులు ప్రారంభించడంతో 750 మెడికల్ సీట్లు అందుబాటులో కొచ్చాయని, పల్నాడు జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసి 80 శాతం పూర్తి చేశామని చెప్పారు. వైద్య కళాశాలల నిర్వహణ కష్టమవుతుందని, వైద్య సీట్లు వద్దంటూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. ఏటా 20 లక్షల ఉద్యోగాలని చెప్పి యువతను మోసం చేశారని, సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని అన్నారు. ఏడాదిన్నర పాలనలో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిన కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.5 వేల కోట్లతో రాష్ట్రంలో పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వైసిపి హయాంలో నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దితే, కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దశలవారీగా పోరాటం చేస్తామని చెప్పారు. దీనిపై ప్రజా సంఘాలు మాట్లాడాలన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

బ్రాహ్మణపల్లిలోని వైద్యకళాశాలకు వెళ్లకుండా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ వైసిపి శ్రేణులు సత్తెనపల్లిలోని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదనం జరిగింది. అరగంట పాటు ఆందోళన కొనసాగింది. అప్పటికే ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో పోలీసులు చెప్పినమీదట ఆందోళనను విరమించారు.

కుళ్లిన గుడ్లు.. పురుగుల జావ..

- **12 ఏళ్లుగా నిరుపయోగంగా మైదానం - పీఈటీ ఉన్నా ఆటలు ఆడించని వైనం**
- **అనుపాలెం జెడ్‌పి పాఠశాలలో సమస్యలపై ఎస్ఎఫ్ఐ వినతి**

ప్రజాశక్తి-రాజుపాలెం



హెచ్ఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండలంలోని కుబాద్‌పురం (అనుపాలెం) జెడ్‌పి పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సభ్యులు డి.అమూల్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం హెచ్ఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ స్కూల్లో ప్లే గ్రౌండ్ దాదాపు 12 ఎకరాలున్నా వినియోగించడం లేదని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేదని చెప్పారు. గుళ్లిపోయిన గుడ్లు పెడుతున్నారని, రాగిజావలో పురుగులు వస్తున్నాయని అన్నారు. మరుగుదొడ్లున్నా ట్యాప్‌లు, సింకులు విరిగిపోయాయని చెప్పారు. ఆయమ్మ ఒక్కరే ఉన్నందువల్ల విద్యార్థులే పరిసరాలు పరిశుభ్రం చేయడం, వాటర్ క్యాన్స్ మోయడం తదితర పనులు చేయాల్సి వస్తోందని అన్నారు. 300 మంది విద్యార్థులున్న పాఠశాలలో పిఇటి కూడా ఉన్నారని, అయితే ఆటలు మాత్రం ఆడించడం లేదని విద్యార్థులు వాపోయారని తెలిపారు. వీటన్నింటినీ వారంలోగా పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మణికంఠరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, స్వరూప, చంద్రిక పాల్గొన్నారు.

పారిశుధ్యం క్షీణించి ప్రజలకు రోగాలు : సిపిఎం

ప్రజాశక్తి - నకరికల్లు



ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని చేజర్ల గ్రామంలో పారిశుధ్యం పడకేసిందని, సత్వరం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సురేష్‌కు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈఊరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సైడ్ కాల్వల్లోని మురుగునీరు రోడ్డుపైకి చేరి నడవడానికి ఇబ్బందిగా ఉందని, దోమలు వ్యాప్తి చెంది స్థానికులు రోగాలపాలవుతున్నారని చెప్పారు. మరో తురకపాలెం సంఘటన పునరావతం కాకుండా చూడాలని కోరారు. గ్రామంలో ఓరవాగు సెంటర్ నుండి చర్చి మీదుగా స్వామి గుడి వద్దకు, ముస్లిమ్ కాలనీ నుంచి పాత చర్చి సెంటర్ వరకు సీసీ రోడ్లు వేయాలని, సైడు కాల్వలు నిర్మించాలని, రోడ్ల మరమ్మతులు చేయాలని కోరారు. సాగర్ కాల్వ నుండి బేతంరాజు చెరువుకు నీటి కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. జల జీవన్ మిషన్ కింద గ్రామంలో తాగునీటి కోసం పైపుల నిర్మాణం పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికీ నీరు సరఫరా చేయాలని విన్నవించారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఎంపిడిఒ కార్యాలయం ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈపూరి అప్పిరెడ్డి, ఎస్.రామాంజి నాయక్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంకుతో సాల్ట్ ఒప్పందం ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచింది

ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకే రణభేరి - సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



తెనాలిలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



పొన్నూరులో మాట్లాడుతున్న రాజశేఖర్



ప్రత్తిపాడులో



పెదనందిపాడులో

ప్రజాశక్తి తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు

విద్యా రంగంలో సంస్కరణల కోసం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న సాల్ట్ ఒప్పందం (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరుస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వ విద్యా విధానాన్ని కాపాడుకునేందుకే రణభేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి జాత శుక్రవారం గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించింది. సాయంత్రం తెనాలి చేరింది. ఈ సందర్భంగా తెనాలి శివాజీ చౌక్ లో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాగానే విద్యారంగంలో సమస్యలను పరిష్కరిస్తామని, ముఖ్యంగా ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు సంబంధించి ప్రవేశపెట్టిన యాప్ల విధానాన్ని రద్దు చేస్తామని, 117 జీవో రద్దు చేస్తామని, 12వ పిఆర్సి కమిషన్ను నియమిస్తామని, డి ఎ బకాయిలు, 11వ పిఆర్సి బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న సాల్టు ఒప్పందాన్ని రద్దు చేయలేదని చెప్పారు. సాల్ట్ ఒప్పందం ప్రభుత్వ విద్యను దిగజారుస్తుందని, ఉపాధ్యాయులను దోషులుగా చూపుతుందని చెప్పారు. రాష్ట్రంలో 34,340 ప్రాథమిక పాఠశాలలు ఉంటే వాటిలో 12,972 సింగిల్ టీచర్ పాఠశాలలని, 540 ఉన్నత పాఠశాలలో జీరో ఎన్రోల్మెంట్ నమోదు అయిందని, ప్రభుత్వ విధానాల కారణంగా రెండున్నర లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారని చెప్పారు. బడ్జెట్లో గతంలో 11.8% నిధులు కేటాయిస్తే, ఇప్పుడు అది 9.8 శాతానికి పడిపోయిందన్నారు. గతంలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేవని, ప్రపంచ బ్యాంకు ఒప్పందాలు లేవని, ఫలితంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ పటిష్టంగా ఉండేదని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రపంచ బ్యాంకు ఒప్పందాలతో ఉపాధ్యాయులపై కత్తి పెట్టి, యాప్ల బారం మోపి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం విధానాలకు, కూటమి ప్రభుత్వ విధానాలకు ఏమాత్రం తేడా లేదని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఆందోళన ఉధతం చేస్తామని చెప్పారు. తక్షణమే ఉపాధ్యాయులను బోధ నేతర విధుల నుంచి తప్పించాలని, 12వ పిఆర్సి చైర్మన్ ను నియమించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలను విడుదల చేయాలని, ఎరండ్ లీవ్ ఎన్క్యాష్మెంట్ కు తక్షణమే అవకాశం కల్పించాలని, 11వ పిఆర్సి బకాయిలను చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మొత్తంగా సెల్ వినియోగం లేని బడిగా మార్చాలని డిమాండ్ చేశారు. రణభేరి జాత ముగింపు సందర్భంగా ఈనెల 25న గుంటూరు లో భారీ ర్యాలీ నిర్వహించి, వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సభ విజయవంతానికి ఉపాధ్యాయులంతా కషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, ప్రచురణ కమిటీ కన్వీనర్ హనుమంతరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు రాజశేఖర్ రావు, ఎం కళాధర్, సహాధ్యక్షులు జివి నాగమణి, కోశాధికారి ఎండి దౌలా, గౌరవాధ్యక్షులు పివి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె సాంబశివరావు, కె కామాక్షి, ఆదినారాయణ, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టిఎస్ఎల్ మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎం కేదార్నాథ్, రాష్ట్ర కౌన్సిలర్ ఆదిలక్ష్మి, బసవేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో బివిఆర్ జడ్పి స్కూలు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు ప్రసంగించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ ఆలీషా, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. పొన్నూరు ఐలాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర నాయకులు ఎన్ వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆర్థిక సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులను కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే అంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పెదనందిపాడు మండలంలోని ఏబీ పాలెం హైస్కూల్ , పెదనందిపాడు లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ గా మార్చేందుకు ఒక్క అడుగు కూడా ఈ కాలంలో ముందుకు పడలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధన పై కేంద్రీకరించే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఉద్యమిస్తుంది అని తెలిపారు. సెప్టెంబర్ 15 నుండి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సెప్టెంబర్ 25 న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేట్ ఇవ్వడం ద్వారా రణభేరి మ్రోగించాలి అని నిర్ణయించిందని తెలిపారు. కావున ఉపాధ్యాయ మిత్రులందరూ యూటీఎఫ్ చేపట్టిన ఈ ఉద్యమంలో పాల్గొని సమస్యల పరిష్కారానికి తమ మద్దతు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రచార జాత కాకుమాను మండలానికి బయలుదేరింది. కాకుమాను మండలంలోని గరికపాడు, రేటూరు, కాకుమాను జిల్లా పరిషత్ హైస్కూల్ లలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న నేతాజీ

ఉన్నచోటనే రెండు సెంట్ల స్థలం ఇచ్చి రెగ్యులైజేషన్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- తాడేపల్లి

పోల్కంపాడు గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ దగ్గర, నివాసం ఉంటున్న పుష్కర కాలనీ పేదలకు ఇప్పుడు ఉంటున్న స్థలాలను రెగ్యులైజేషన్ చేయటంతో పాటు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతాజీ మాట్లాడారు. 2016 పుష్కరాల సందర్భంగా సీతానగరంలో ఇల్లు తొలగించిన పేదలకు స్థలాలు ఇస్తామని, అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ఇచ్చిన హామీని పాలక పార్టీలు నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. మళ్లీ పుష్కరాలు రాబోతున్న ఆనాడు ఇచ్చిన హామీకి నేటికి అతిగతీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో సిపిఎం ఒత్తిడి మేరకు తాత్కాలికంగా 45 గజాల స్థలం ఇచ్చి సరిపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా పుష్కర్ కాలనీ బాధితులకు రెండు సెంట్లు ఇళ్ళ స్థలం వెంటనే మంజూరు చేయాలని కోరారు. లేదంటే పేదల తరపున సిపిఎం ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎస్ గిరిజ, కే మేరీ, స్థానికులు రోజా, సోమేశ్వరి, దుర్గ, రమాదేవి, మేరీ, మల్లేశ్వరి, పద్మ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు శేకూరు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 నెట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని శేకూరు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిలకలూరిపేట ఎఎంజి హైస్కూల్లో నిర్వహించిన సెలక్షన్‌లలో తమ పాఠశాల నుండి 9వ తరగతి విద్యార్థులు కారుమూరి నరేంద్ర, కేసాని లిఖిత, గరిక ధనుశ్రీ విజయం సాధించారన్నారు. త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర పోటీల్లో పాల్గొటారని తెలిపారు. విద్యార్థులను విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఒ, స్థానిక కార్పొరేటర్

స్వర్ణభారతి నగర్‌లో పోషణ్ మహా కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పశ్చిమ, స్వర్ణభారతి నగర్ 4 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ మహాకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు పిల్లల తండ్రులకు కూడా పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఐసిడిఎస్ సిడిపిఒ అరుణ, 41వ డివిజన్ కార్పొరేటర్ స్మిత పద్మజ, హెల్త్ సెక్రెటరీ, మహిళా పోలీసు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఐటిసి నుండి శైలజ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు.

పారిశ్రామిక రంగంలో విస్తృత అవకాశాలు

ఇవి ఐజడ్‌పి ఆటోస్ ఇండియా ప్రైవేటు లిమిటేడ్ వ్యవస్థాపకులు సత్యనారాయణ ప్రసాద్ - వివిఐటియులో రెండ్రోజుల ఎక్సోషియా-2కే25 సాంకేతిక సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - పెదకాకాని

ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగంలో విస్తత అవకాశాలు ఉన్నాయని, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లు విద్యార్థులు సన్నద్ధం కావాలని ప్రముఖ ఈవి సంస్థ ఐజడ్‌పి ఆటోస్ ఇండియా ప్రైవేటు లిమిటేడ్ వ్యవస్థాపకులు సత్యన్నారాయణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీలోని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగము ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఎక్సోషియా-2కే25 సాంకేతిక వేడుకలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. బ్యాటరీ సంభందిత రంగాలలో యువ ఇంజనీర్లకు మంచి అవకాశాలు ఉన్నయని అన్నారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సదస్సులో సర్క్యూట్ కార్నివాల్, వాటి- ఏ- ఫైట్, కోడ్ బ్రేకర్స్, ఎలిమినేటర్స్ ఎరీనా మరియు ప్రాజెక్ట్ ఎక్స్పో వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుండి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై మల్లిఖార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు, ఈఈఈ విభాగధిపతి డాక్టర్ ఎవి నరేష్‌బాబు డాక్టర్ సి హెచ్ నాగసాయి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెదకాకాని

వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తక్షణం అనుసరించాలని ఎటి అండ్ టి టాలెంట్ అక్విజిషన్ డైరెక్టర్ పద్మజా శ్రీరామ్ అన్నారు. శుక్రవారం వివిఐటియూలో ప్రీ ప్లేస్‌మెంట్ టాక్, ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మజా శ్రీరామ్, సీనియర్ స్పెషలిస్ట్ గోపినాధ్ సంగరాజు మాట్లాడుతు కార్పోరేట్ ప్రపంచంలో విద్యార్థులు తమ భవిష్యత్తును అందంగా మలుచుకోవాలంటే సాంకేతిక మార్పులను నిత్యం గమనించాలని ప్రస్తుతం వేగంగా అభివద్ధి చెందుతున్న కత్రిమమేధ ప్రాముఖ్యతను తెలుసుకోవా లని అన్నారు. ఈ సందర్భంగా ఎటి అండ్ టి ప్రతినిధులు విద్యార్థులకు కెరీర్ అంశాలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై మల్లిఖార్జునరెడ్డి, సిఎస్ఇ విభాగధిపతి డాక్టర్ వి రామచంద్రన్, సిఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ కె సరేష్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఎన్.ఆర్.టి. సెంటర్‌లోని జి.వి.ఐ.ఐ.టి పాఠశాలలో కాషాయ, ఊదారంగు దినోత్సవ వేడుకలు శుక్రవారం నాడు జరిగాయి. వేడుకలను నర్సరీ, ఎల్.కె.జి., యు.కె.జి., ఒకటవ తరగతి చిన్నారులు ఆరెంజ్, ఊదా రంగు దుస్తులలో ఐస్ క్రీమ్, గుమ్మడిపండు, చేప, ఆరంజ్ ఫ్రూట్, క్యారెట్, సీతాకోక చి లుక, వంకాయ, వంటి వివిధ రకాల వస్తువుల, కాయగూరల వేషధారణ లతో సందడి చేశారు. బాల్స్, కేక్స్, చాకొలేట్స్, బిస్కెట్స్, టెడ్డీ బేర్స్,బెలూన్స్,క్యాప్స్ ఇలా అన్నింటిని అల కరించి ఆట పాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పారేపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలు ఆడుతూ పాడుతూ ఎక్కువ విషయాలను చాలా తక్కువ సమయంలో సులభరీతిలో నేర్చుకోవటా నికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయిలు, చిన్నారుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి.

ప్రజాశక్తి - వినుకొండ

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20వ తేదీ శనివారం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి నియోజకవర్గంలోని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అందరూ తప్పనిసరిగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు శుక్రవారం కోరారు. ప్రభుత్వ ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు నిర్వహించి, అన్ని రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినుకొండ పట్టణ పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరోనా సమయంలో ముందుండి సమాజానికి సేవ చేసిన పారిశుద్ధ కార్మికులకు వైద్య సేవలు అందించడం, వారి ఆరోగ్యాన్ని సంరక్షించడం ప్రభుత్వం బాధ్యతగా గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు గుండె సంబంధిత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తప్పనిసరిగా పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని జీవి ఆంజనేయులు కోరారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - వినుకొండ

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శివపురం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సర్పంచ్ కమతం సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. సుబ్బమ్మ మాట్లాడుతూ మహిళలందరూ తడి చెత్త, పొడి చెత్త గురించి తెలుసుకోవాలని, ప్లాస్టిక్ వాడొద్దని పరిసరాలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఇంటి ముందు మొక్క నాటుకోవాలని తెలిపారు. ఎంఆర్‌సి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు బదులు పేపర్ బ్యాగ్స్ జ్యూట్ లేదా బట్ట సంచులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసోబు అసిస్ట్ కోఆర్డినేటర్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ మేడిపల్లి రక్షణ, భార్గవి, విజయ పార్వతీపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, కోటిరెడ్డి, టీచర్లు విద్యార్థి విద్యార్థులు గ్రామ మహిళలు పెద్దలు పాల్గొన్నారు.

పడకేసిన పట్టణాలు.. పల్లెలు..

ప్రజల పీడిస్తోన్న జ్వరాలు, సీజనల్ వ్యాధులు - దోమల దండయాత్ర, నివారణ చర్యలు నిల్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జ్వరాలు.. జలుబు.. దగ్గులు.. వళ్ళు నిప్పులు.. ప్రస్తుతానికి ఎవరిని కదిలించినా ఇదే సమస్య. పట్టణ పల్లె అనే తేడా లేకుండా అన్నిచోట్ల దోమ కాటు, వైరస్, సీజనల్ వ్యాధులతో పట్టణాలు, పల్లెలు పడేకేశాయి. వర్షాకాలంలో సహజంగా వాతావరణ మార్పులు, పారిశుధ్య లోపం తదితర కారణంగా ప్రతి సంవత్సరం వ్యాధులు వచ్చేవే. అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి కాస్త ఇప్పుడు తీవ్రంగా జనాన్ని వేధిస్తున్నాయి. జ్వరాలు చిన్నాపెద్ద అనే తేడా లేదు. ఇవి ఇప్పుడు పిల్లల్లో నూ ఎక్కువగా ఉన్నాయి. విష జ్వరాల వల శరీరం విపరీతమైన నొ పులతో వేధిస్తు హాస్పటల్ పాలుచే స్తూన్నాయి. సాధారణ కూలి నాలి చేసుకునే వారి పనులకూ ఆటంకం గా మారాయి. జ్వరం వచ్చిందంటే వా రం,పది రోజులు తిరగ లేక పోతు న్నారు. దానికి తోడు డెం గీ భయం కూడా ఉన్నందున ప్రజలు ఇప్పుడు దేన్నీ నిర్లక్ష్యం చేయకుండా ఆసుప త్రులకు పరుగులు తీస్తున్నారు. పట్ట ణంలో ఉన్న ప్రతి ప్రయివేటు ఆసు పత్రులు జ్వర పీడితులతో కిటకిట లాడు తున్నాయి...ఎక్కువ రోజులు జ్వరం ఉంటే రక్త పరీక్షలూ తప్పడం లేదు. మళ్లీ డెంగీ వంటి ఇతర జ్వరాలకు దారితీస్తే ప్రమాదమని ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా ప్రయివేటు హాస్పిటల్ వారు రక్త పరీ క్షలకు రూ.2500 నుంచి రూ.3000 దాకా వసూలు చేస్తున్నారు. ఇంకా రూమ్



రెంట్, ఇతర పరీక్షలు, డాక్టర్ ఫీజులు, మందులు అంటూ షుమారుగా రూ. 25 నుంచి సందర్భాన్ని బట్టి 35, 40 వేలు దాకా ఖర్చులు చేయాల్సి వస్తోందని పేదలు, నీరు పేదలు, మధ్య తరగతి వారు సైతం వానికి పోతు న్నారు.మరో వైపు పారిశుద్ధ్య సమస్య, వర్షాలకు తాగునీరు కలుషితం వంటి ప్రధాన సమస్యలు వెంటాడుతున్నారు. కట్టుదిట్టమైన చర్యలు లేవు. చెరు వులు, స్టోరేజీ ట్యాంకుల్లో వర్షపు నీరు కలిసింది. దీన్నే తాగు నీటి పథకాల ద్వారా అందిస్తున్నారు పిల్టరు పాయింట్లు ఎక్కడా సమర్ధవతంగా పని చేయడం లేదు. నీటి



చికిత్స పొందుతున్న జ్వరపీడుతులు, పేరుకుపోయిన చెత్త

రంగు, రుచి కూ డా మారింది. ఇక పారిశుధ్యం కూడా అధ్వానంగానే ఉంది. పంచాయతీ ల్లో నిధు ల్లేక ఎక్కడా సరైన చర్యలు లేవు. పట్టణాల్లోనూ పారిశుధ్య కార్మి కులు ఉన్న ఎక్కడి చెత్త అక్కడే ఉం డి చెత్త టన్నుల కొద్ది పెరిగి పోతోంది. దీని వల్ల కూడా దోమల ఇబ్బందులు తప్పడం లేదు. ముందస్తు చర్యలు మచ్చుకు అయిన కంపించటం లేదు. ప్రస్తుతవ మలేరియా, డెంగు వ్యాధులు ఉన్న ప్పటికీని అవి స్థానికులకు కాకుండా జీవన ఉపాధి కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి మాత్రమే ఉన్నాయని సంబంధిత మలేరియా వైద్యాధికారులు చెబుతున్నారు. అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి నిల్వలు ఉండ కుండా జాగ్రతలు తీసుకోవాలని, మంచినీటి ట్యాంకులను తప్పనిసరిగా వారానికొకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆశలు, ఎఎన్ఎం ల ద్వారా సచివాలయ సిబ్బందితో "సమన్వయం చేసుకుని దోమలు వృద్ధి చెంచటండా ఇంటింటికి అవగాహన కల్పించే కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దోమల నివారణకు సంబంధించి ముస్కుటో కాయిన్స్, దోమ తెరలు ఉచితంగా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా జెట్టి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్



జెట్టి సైదులను సన్మానిస్తున్న సభ్యులు

సత్తెనపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ నూతన గౌరవాధ్యక్షులుగా జెట్టి సైదులును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ కార్యాలయం ఏర్పాటులో జెట్టి సైదులు ఎంతోగానో సహకరించారని అన్నారు. జెట్టి సైదులు మాట్లాడుతూ పెన్షనర్ సేవలు కొరకు తనవంతు సహకారాన్ని అందించగలనని, తనమీద అభిమానాన్ని చూపెట్టి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి కె.బి.ఆర్.జె. మాట్లాడుతూ నూతన బృంద సభ్యులతో కలసి పనిచేయాలని మంచి సలహాలు ఇవ్వాలని వారిని కోరారు. అనంతరం సైదులును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమలో ట్రెజరర్ రంగారెడ్డి, ఉపాధ్యక్షులు పోతులూరయ్య ప్రభుదాసు సత్తెనపల్లి సైదులు మల్లేశ్వరరావు, సూర్యనారాయణ మోహిద్దీన్ జయనుల్లా, జగన్నాథ నాయుడు, రవీంద్రనాథ టాగూర్ వెంకట్రావు నాగవర్ధన్ రమాదేవి చంద్రయ్య, సుబ్బారావు, క్రీస్తు దాసు జాన్ సుందర్ సింగ్, కొండవీటి అంతయ్య, వాసు చందు, ఖాదరవలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

జాతీయ సేవా విభాగం తరపున నిర్వహించిన రక్తదాన శిబిరంలో 88 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు. పెద్ద పట్టణాలలో కూడా లేనివిధంగా స్వచ్ఛందంగా ఇంత మంది రక్తదానం చేయడం చాలా అభినందించదగిన విషయంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ మహేష్ రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నయీం భాను గారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో డాక్టర్ మహేష్ గారు మాట్లాడుతూ రక్తదానం చేయడం గొప్ప సామాజిక సేవ అని, అత్యవసర సమయంలో రక్తం లేక చనిపోయే వారిని రక్త దాతలు కనీసం ఇద్దరిని కాపాడినట్లేనని, ఆరోగ్యవంతుడైన మనిషి ప్రతి



రక్తదానం చేస్తునన విద్యార్థులు

మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చుని తెలియజేశారు.స్టాఫ్ నర్స్ బి.నాగరాజ క ుమారి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన కలిగే ఉపయోగా లను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ విజయ్ కుమార్, డిప్యూటీ వార్డెన్ సతీష్ బాబు, కళాశాల సిబ్బంది, స్థానిక ప్రాథమిక వైద్యశాల సిబ్బంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రఖ్యాత జెన్ ట్రీ ల్యాబ్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ విద్యార్థులు 11 మంది కొలువులు సాధించారని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులు కళాశాలలో ఈనెల 11న నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 200 మంది విద్యార్థులు పాల్గొనగా రాత, ముఖాముఖి పరీక్షలు, గ్రూప్ డిస్కషన్‌లలో ప్రతిభ చాటిన సి.ఎస్.ఇ, ఐటి, ఇసిఇ, ఏఐఎంఎల్ విభాగాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపిక కాగా వార్షిక వేతనం 3 లక్షల ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారన్నారు. తమ విద్యార్థులకు 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా వృత్తి విద్యా పరమైన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

నేపథ్యంలో తమ విద్యార్థులు సులభంగా కొలువులు సాధిస్తున్నారన్నారని అన్నారు. కళాశాల చైర్మన్ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సెక్రటరీ & కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ కొలువులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అభినందన సభలో టిపిఓ ఎం.సాంబశివరావు, ఆయా విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పత్తి పొలాలను పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పత్తి రైతులందరూ సామూహికంగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని లాంఫాం శాస్త్రవేత్త ఎస్.రాజమణి రైతులకు సూచించారు. మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో లామ్‌ఫాం ప్రధాన శాస్త్రవేత్తలు రాజమణ, చాముండేశ్వరి, రమేష్ చౌదరి, నాగజ్యోతిలు శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగాకర్షక బుట్టల వలన గులాబీ రంగు పురుగు ఉధృతిని తెలుసుకోవచ్చున్నారు. నీరు నిలుచున్న పంట పొలాల్లో అధిక నీరుని తీసివేసి, మొక్కలు చనిపోవడం గమనిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెన్డజిమ్ 1 గ్రాము లీటర్ నీటికి వేర్లు తడిచేలా పోసుకోవాలి మరియు ఎకరా కు 20 కిలోల నత్రజని మరియు 10 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలన్నారు. 19:19:19 లేదా 13:0:45 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలని వివరించారు.. అలాగే రైతులు అందరూ లింగాకర్షణ బుట్టలు ఒక ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్ అలాగే పచ్చదోమ మరియు తెల్లదోమ ఉధృతి గమనించినట్లయితే ఇమిడాక్లోప్రిడ్ 100 మి. లీ/1 ఎకరాకి లేదా థియామెథాక్సామ్ 80 గ్రాములు/1 ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఏడిఎ బి.రవిబాబు, ఏఓ బి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఓ వెంకటరమణ

మంచి ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

పోషక విలువలు కలిగిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని సిడిపిఓ వెంకటరమణ కోరారు. శుక్రవారం మండలంలోని పొడపాడులో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. తండ్రులకు వంటలు పోటీలు జరిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ పెద్ద ఇమాంబి, అంగన్‌వాడీ కార్యకర్తలు రహంతున్నీసా, సుమతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండల కేంద్రంలో డ్రెయినేజీ, తాగునీటి, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఫిరంగిపురం మండల కార్యదర్శి ఎస్.కె. మస్తాన్‌వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఫిరంగిపురం గ్రామంలోని అల్లంవారిపాలెంలో డ్రెయినేజీ, మంచినీటి చెరువును, రోడ్లను సిపిఎం నాయకత్వం పరిశీలించడం జరిగింది. డ్రెయినేజ్ కాల్వ చెట్లతోటి, జమ్ముతోటి, ముళ్లకంప తోటి నిండిపోయిందని దీనివల్ల డ్రెయినేజీ పక్కన ఉన్నటువంటి చెరువులోకి డ్రెయినేజీ నీరు ఊరి కలుస్తుందని దీనివల్ల మంచినీరు కలుషితమై చర్మ వ్యాధులు వస్తున్నాయని, దద్దుర్లు, దురదలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువను బాగు చేసి చెరువు కట్టకు కాలుకు మధ్యన సైడ్ వాల్‌ను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిరంగిపురం నుండి సత్తెనపల్లి వెళ్లే రోడ్డు లో రైల్వే గేట్ వద్ద నుండి గుంటల తోటి చెరువులను తలపిస్తుందని గుంటలు పడి రోడ్డు అంత పాడైపోయిందని కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తు న్నాయని తెలిపారు. వర్షం వస్తే గుంటలు కనిపించక వాహన దారులు పడిపోతు న్నారని దీనితో ప్రమాదాన్ని గురవుతున్నారని తెలిపారు. అలాగే అల్లంవారిపాలెంలో ఉన్న చెరువును అభివృద్ధి చేయాలని చెరువుకి చుట్టుపక్కల ముల్లకంప పెరిగిపోయిందని దీన్ని బాగు చేసి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని వారు కోరారు. లేనిచో ప్రజలను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ ఫిరంగిపురం కార్యదర్శి ఎ.అంకమ్మరావు, రామారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

290వ రోజుకు చేరిన దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 290 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, బి.సూర్యప్రకాష్, ఎం.ఆశీర్వాదం, యహోషువ ప్రారంభించారు. దీక్షలలో మొలకా శారదా, బొందలపాటి నవనీతం, దేరంగుల రమణ, వేము రిబ్కా, దామవరపు సువర్ణకుమారి కూర్చున్నారు. కార్యక్రమంలో బి.అంకయ్య, ఇస్మాయిల్, జి.వెంకటేశ్వర్లు, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరావు, ఇశ్రాయేల్, శరమ్మా, దుర్గాభవాని, శివకుమారి, కాసమ్మ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, నాయకులు ఊట్ల కనక మల్లికార్జునరావు, బిట్రా కోటేశ్వరరావు, పంది దుర్గారావు, పాగోలు శంకర రావు, పంది నాగులు, బిట్రా సూర్యచంద్ర రావు, కాటబత్తుల అంజియ్య, తెంపల్లి శంకర రావు, దామర్ల శ్రీను, కొక్కిరిపాటి పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 విధానం రద్దు చేయాలని కోరుతూ మంగళగిరి దస్తావేజు లేఖరులు రెండు రోజులు పెన్ డౌన్ ప్రకటించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్ర, శనివారం పెన్ డౌన్ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ విధానం వల్ల సామాన్య ప్రజానీకం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయని వారు వివరించారు. ప్రస్తుత సామాజిక సైబర్ క్రైమ్ దృష్ట్యా ఓటిపి నంబర్ చెప్పేందుకు పలువురు నిరాకరిస్తుండడంతో ఇది ఒక పెద్ద సమస్యగా మారింది అని వారు తెలిపారు. ఆటో మ్యుటేషన్ విధానం గందరగోళంగా మారుతుందని వారు చెప్పారు. ఈ వ్యతిరేకత పట్ల విసుగెత్తిన దస్తావేజులేఖర్లు రిజిస్ట్రేషన్ విధానానికి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి దస్తావేజులేఖర్లు, వారి సహాయకులు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్‌కి వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖరులు



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాల పద్మ

నేడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ప్రతి నెలామూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహ సముదాయంలో హరితాంధ్రప్రదేశ్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

22న గ్రామ సచివాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - దుగ్గిరాల

సమస్యలు పరిష్కరించాలని ఈనెల 22వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ తెలిపారు. మండలంలోని మంచికలపూడి తుమ్మపూడి గ్రామాలలో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న హింస వేధింపులకు వ్యతిరేకంగా మహిళా సంఘాలు పని చేస్తున్నాయన్నారు. స్థానిక మహిళల సమస్యలపై పరిష్కారానికి ఈనెల 22వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలను ఎన్నుకరారు. అధ్యక్షులుగా ఎం.కోటమ్మ, కార్యదర్శిగా లలిత కుమారి, చికలపూడిలో అధ్యక్షురాలుగా తనూజ, కార్యదర్శిగా స్వర్ణ గౌరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఇందిరా, బి.అరుణ, ఎం.పకీరమ్మ, ఎ.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని, భూయజమాని ప్రమేయం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ 22వ తేదీన జరిగే చలో విజయవాడ విజయవంతం చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ కోరారు. మండలంలో తక్కెళ్ళపాడు గ్రామం కౌలు రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు భూయజ మానితో ప్రమేయం లేకుండా కౌలు రైతులందరికీ రుణాలు ఇస్తామని, రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. టిడిపి ప్రభుత్వం సంవత్సరం ఆరు నెలలు దాటిన ఇంతవరకే కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారము కౌలు చట్టం తీసుకురాలేదు. చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పౌష్టికాహార మాసోత్సవం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచి మధుసూదన్‌రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతినెలా చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషకాహారాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. డాక్టర్ సబీర బేగం మాట్లాడుతూ పోషణ, సంరక్షణలో పురుషులు చురుకైన పాత్ర వహించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.చిన్నమ్మాయి మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు పాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటి వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్ సిహెచ్.ఓ ఎన్.వెంకటలక్ష్మి, హెచ్ఎస్ సుదర్శన్, నుదురుపాడు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు ఉదయలక్ష్మి, మీరాబీ, లక్ష్మీ ప్రసన్న, విజయకుమారి, కోటమ్మ, నవరాణి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార మసోత్సవంలో పాల్గొన్న సిబ్బంది

అవసరమైన మేరకే ఎరువులు ఉపయోగించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మట్టి పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకు సమీకృత ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి విజయబాబు అన్నారు. మండలంలోని చిలువూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు పొలంబడి కార్యక్రమంలో రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతుల ధ్రువీకరణ యొక్క ప్రాధాన్యతను తెలిపారు. అవసరం మేరకు పురుగుమందులు ఎరువులు ఉపయోగించి వాటి అవశేషాలు లేని ధాన్యం పండిస్తే అధిక ధర లభించడతో పాటు విదేశీ ఎగుమతులకు అవకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ విహెచ్ఏ ప్రశాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ధనేకుల నాగేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ధనేకుల నాగేశ్వరరావు (ఫైల్)

టిడిపి సీనియర్ నాయకులు ధనేకుల నాగేశ్వరరావు (బాబు) గురువారం మృతి చెందారు. ఆయన చిర్రావూరు గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యులుగా విశిష్ట సేవలందించారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కొంతకాలం క్రితం కన్నుమూశారు. నాగేశ్వరరావు మృతి వార్త తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు శుక్రవారం నాగేశ్వరరావు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధిగా నాగేశ్వరరావు ప్రజల కోసం పని చేసే వారిని పలువురు రాజకీయ నాయకులు తమకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. నాగేశ్వరరావు కుమారుడు ధనేకుల బ్రహ్మానంద రావు గ్రామంలో ప్రజా ప్రతినిధిగా తెలుగుదేశం ఎంపీటీసీ సభ్యులుగా పనిచేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఐ నాయకులు ముసునూరు సుహాస్, టిడిపి మండల కార్యదర్శి దాసరి కృష్ణ, టిడిపి పెనుమాక నాయకులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, టిడిపి గుండిమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, కొమ్మారెడ్డి బుజ్జి, వెంకటేశ్వరరావు, ఇప్పటం సొసైటీ అధ్యక్షులు పోకల బాపయ్య, సిపిఎం గ్రామ కార్యదర్శి బొప్పన గోపాలరావు, సిపిఎం నాయకులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు, పోకల శంకరరావు, మేడూరు పాములు, తాడే కోరు కొండయ్య, తాడేకోరు ఏసుబాబు, చల్లపల్లి ప్రేమనాథ్ ఉన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో ఈనెల 22 నుండి శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను శుక్రవారం దేవస్థానం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఛైర్మన్ భోగి కోటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు వేజెండ్ల విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వేజెండ్ల విద్యార్థిని ఎంపికయ్యారని వేజెండ్ల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పిడి దాసరి విజయదుర్గ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.గౌరేశ్వరిదేవి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ పఠాన్ రబియా, గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రజల ఆరోగ్య భద్రతకే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత : పెమ్మసాని

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న పెమ్మసాని

ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రియారిటైజింగ్ పేషెంట్ సేఫ్టీ ఇన్ హెల్త్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఎయిమ్స్‌లో శుక్రవారం జరిగిన నేషనల్ పేషెంట్ సేఫ్టీ కాన్ఫరెన్స్ - 2025 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హాస్పిటల్లో ప్రొఫెషనల్ ట్రీట్మెంట్, డయాగ్నోసిస్ చేయకపోవడం వల్ల గానీ, లేదా ఇచ్చిన ట్రీట్మెంట్ క్రమ పద్ధతిలో ఇవ్వకపోవడం వల్ల గాని ఇండియాలో 50 లక్షల మంది చనిపోతున్నారని తెలిపారు. అందుకు పరిష్కారం దిశగా ప్రయత్నిస్తూ ఇండియాలోని అన్ని టీచింగ్ హాస్పిటల్స్ లో పేషెంట్స్ సేఫ్టీ అనే అంశం మీద ఇలాంటి ఒక పెద్ద కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎయిమ్స్ మంగళగిరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతా సింగ్, డాక్టర్ సుజాత చౌదరి, డాక్టర్ రామ్మోహన్ , డాక్టర్ వంశీ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి - తుళ్లూరు



ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మండల కేంద్రం తుళ్లూరులో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద ఫాగింగ్ చేయించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి అధికంగా అవకాశం ఉన్నందున నివారణకు చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి ఆర్.రమణ చెప్పారు.

రైల్వే స్టేషన్ సబ్‌వేను సందర్శించిన మంత్రి పెమ్మసాని

అభివృద్ధి పనుల్లో నాణ్యత లేమిపై అసంతృప్తి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రైల్వే స్టేషన్‌లో నిర్మాణ పనులు తనిఖీ చేసి, అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తే అండర్‌పాస్‌వ్యవస్థను వ్యవస్థను అధ్వాన్నంగా మార్చారన్నారు. కొన్ని చోట్ల నూతన కట్టడాల మధ్య నుండి పగుళ్ళు, నీరు ఉబికి వస్తుందన్నారు. పనుల నాణ్యతపై, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్నారు. ఇంత ప్రమాదకరంగా ఉంటే ప్రజలు ఎలా ప్రయాణిస్తారని అధికారుల్ని ప్రశ్నించారు. ప్రజల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధాని మోడీ రైల్వే స్టేషన్లను కూడా ఎయిర్‌పోర్టుల మాదిరిగా అభివృద్ధి చేయాలని రైల్వే స్టేషన్లకు రూ.50 కోట్ల నుండి రూ.100 కోట్లు చొప్పున కేటాయించారని, ఇటీవల గుంటూరు రైల్వే స్టేషన్‌లో జరిగిన పనులకు సంబంధించి కూడా లీకులు ఏర్పడ్డాయన్నారు. కొన్ని పాత వర్కులతోపాటు, కొత్త వర్కులు కూడా లీకులు ఉన్నాయన్నారు. దీనిపై గతంలో సందర్శించినప్పుడు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశామన్నారు. జిఎంసి పరిధిలో కొన్నిచోట్ల నీరు బ్లాక్ అవుతుందని తెలిసిందని, వాటిని తాము బాధ్యత తీసుకొని సరిచేస్తామన్నారు. నాణ్యమైన పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీలా, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితమైతే అధికారులదే బాధ్యత : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, కలుషితం అయితే సంబంధిత అధికారులదే బాధ్యతని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. భారీ వర్షాల వలన వ్యాధుల నియంత్రణకు ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తరుచుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాగునీరు, దోమల ద్వారా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, కావున వాటి నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, మరుగు దొడ్లు వినియోగించిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖా సహకారంతో ఎక్కువ మంది అస్వస్థతకు గురైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు, డిఈఈలతో 6 బందాలుగా ఏర్పడి పైప్‌లైన్లు, పబ్లిక్ ట్యాప్‌లను తనిఖీ చేయాలని, నీటి సరఫరా సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలన్నారు. అన్ని రిజర్వాయర్లను శుభ్రం చేయాలని, పైప్ లైన్లు చెక్ చేసి లీకులు గుర్తిస్తే తక్షణం మరమ్మతులు, డ్రైన్లలో పైప్‌లైన్లు ఉంటె షిఫ్ట్ చేయాలన్నారు.

ఖాళీ స్థలాలు శుభ్రం చేయించుకోవాలి

గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా పిచ్చి మొక్కలు పెరిగి చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బందిగా ఉన్న ఖాళీ స్థల యజమానులకు స్థలాలు శుభ్రం చేసుకోవాలని, లేకుంటే అపరాధ రుసుం విధిస్తామని నోటీసులు ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం కావేరి నగర్, కెవిపి కాలనీ, రత్నగిరి కాలనీ, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్యం, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.



అతిథులకు జ్ఞాపికలు అందచేస్తున్న ప్రిన్సిపాల్

ఆర్‌విఆర్ జెసిలో ఇంక్యుబేటర్స్ మీట్

ప్రజాశక్తి-గుంటూరు : ఏపీని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న లక్ష్యమని, అమరావతి-రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆర్‌విఆర్ జెసి ఇంక్యూబేషన్ సెంటర్ సహకారం అందిస్తూ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ప్రత్యేక విధుల అధికారి దీప్తి రావుల అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ ఇన్క్యుబేటర్స్ మీట్' లో ఆన్‌లైన్ పాల్గొన్న దీప్తి రావుల మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకతను వాణిజ్యపరమైన ఆవిష్కరణలుగా మలచడంలో, కొత్త వ్యాపార ఆలోచనలను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో ఇన్క్యుబేటర్లు కీలకపాత్ర పోషిస్తూ ప్రపంచ దేశాలను ఆకర్షించే విధంగా ఏ.పీ ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. విజయవంతమైన పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకొని, స్టార్టప్‌లను ప్రోత్సహించే మార్గాలు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని, సెక్రటరీ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ జెసిలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-గుంటూరు : సివిల్ ఇంజనీరింగ్ రంగంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఆవిష్కరించి, వాటిని విద్యార్థులకు చేరవేసే దిశగా అధ్యాపకులు బోధనా సరళిలో పురోగతి సాధించాలని ఉష్టా ఇన్ఫినిటీ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ కైజాద్ అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో 'స్మార్ట్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ డ్యూరబుల్ స్ట్రక్చర్స్' అనే అంశంపై గత 5 రోజుల నుండి నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు హాజరై స్మార్ట్ మెటీరియల్స్, నానో టెక్నాలజీ, ఇన్నోవేటివ్ టెక్నాలజీస్, గ్రీన్ కన్స్ట్రక్షన్, రీసైకిల్ టెక్నాలజీస్, నిర్మాణంలో ఎఐ ఇంజినీరింగ్, సుస్థిర నిర్మాణ పద్ధతులు, కాంక్రీట్ రిపేర్ టెక్నిక్స్, అడ్వాన్స్డ్ మానిటరింగ్ టూల్స్ వంటి వివిధ ఆధునిక సివిల్ ఇంజనీరింగ్ రంగంలోని అంశాలపై నిపుణులు తమ సందేశం అందించారు.కైజాద్ మాట్లాడుతూ సుస్థిరమైన నిర్మాణాల కోసం స్మార్ట్ మెటీరియల్స్ వినియోగం భవిష్యత్తు అవసరమని, ఇలాంటి శిక్షణలు పరిశోధన, బోధనలో నాణ్యతను పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ నిపుణులు డాక్టర్ ఎల్.ఆర్.మంజునాధ, డక్టార్ శ్రీనివాస్ ఒగ్గు, సుబ్బారెడ్డి.యెన్, భావిక్ కిషోర్ ధామి తదతరులు ప్రసంగించారు.

టిడిపిలోకి మర్రి రాజశేఖర్

పుల్లారావు అయిష్టత - శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో చేరిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. పార్టీ కండువా కప్పి రాజశేఖర్‌ను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ తాను వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని తెలిపారు. అయితే మండలి చైర్మన్ తన రాజీనామాను ఇంకా ఆమోదించలేదన్నారు. ఆరు నెలలు వేచి చూసి రాజీనామా ఆమోదించకపోవడంతో టిడిపిలో చేరినట్టు ప్రకటించారు. 2010 నుంచి వైసిపి లో చురుగ్గా పనిచేసినా 2018 నుంచి ఆయనకి ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. వైసీపీలో మాజీ మంత్రి విడుదల రజనీకి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల చాలా కాలంగా ఆ పార్టీలో అసంతప్తిగా ఉన్నారు. ఎట్టకేలకు రాజశేఖర్‌కి 2023లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చినప్పటికీ ఆయన ఆ పార్టీలో కొనసాగ లేక పోయారు. 2024 ఎన్నికల్లో విడుదల రజిని గుంటూరులో పోటీ చేసి ఘోర పరా జయం పాలయ్యారు. ఎన్నికలు పూర్తి అయిన వెంటనే ఆమెను తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో మర్రి రాజశేఖర్ మరింత అసంతృప్తికిలోనయ్యారు. అంతేకాక పార్టీలో జరుగుతున్న పరిణామాలను గమనించిన ఆయన క్రమంగా పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఆరు నెలల క్రితం ఎమ్మెల్సీ పదవి రాజీనామా చేశారు. అయినా చైర్మన్ ఆమోదించ కపోవడంతో ఆ పదవిలో కొనసాగుతున్నారు. అలాగే వైసీపీకి కూడా రాజీనామా చేసి టిడిపిలో చేరారు. అయితేమర్రి రాజశేఖర్ టిడిపిలో చేరిక సమయంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. చిలకలూరిపేట రాజకీయాల్లో దీర్ఘకాలికంగా పుల్లారావుకు, రాజశేఖర్ మధ్య రాజకీయ అంతరాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో వీరిద్దరి మధ్య రాజకీయంగా



ఎటువంటి విభేదాలు లేకపోయినా ఆశించినంత సఖ్యత మాత్రం లేదని చెప్తున్నారు. చిలకలూరిపేట రాజకీ యాలలో వీరిద్దరూ గత కొంతకాలంగా ముభావంగానే ఉంటున్నారు. అంతేకాక మర్రి రాజశేఖర్ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయల సహకారంతో టిడిపిలో చేరటం పుల్లారావు మింగుడు పడడం లేదు. అందువల్లే ఆయన రాజశేఖర్ పార్టీలో చేరే సమయంలో హాజరు కాలేదని తెలిసింది. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తో పాటు పల్నాడు జిల్లా నాయకులు ఎవ్వరూ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మర్రి వెంట నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ లు ఆలపాటి రాజేంద్రప్రసాద్ , పంచుమర్తి అనూరాధ పాల్గొన్నారు.

మర్రి కి ప్రాధాన్యత ఇచ్చారు : రజనీ

వైసిపి లో మర్రి రాజశేఖర్ కి సముచిత స్థానాన్ని ఇచ్చారని మాజీ మంత్రి విడదల రజని తెలిపారు. శనివారం ఆమె మీడియా తో మాట్లాడుతూ వైసిపి లో కీలకమైన ఎం.ఎల్.సి. పదవి ఇచ్చినా ఇంకా ప్రాధాన్యత ఇవ్వలేదనీ చెప్పడం సరికాదన్నారు. టిడిపి లోకి వెళ్ళాలనీ నిర్ణయం తీసుకుని జగన్ పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

కలుషిత నీటితోనే డయేరియా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో గత వారం రోజులుగా కలుషితమైన నీరు త్రాగటం వల్లనే డయేరియా రోగులు పెరుగుతున్నారని రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణ రెడ్డి అన్నారు. జిజిహెచ్‌లో డయేరియా బాధితులను శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత గుంటూరు, శ్రీనగర్, బొంగరాల బీడు, డొంక రోడ్డు ప్రాంతాల నుండి అత్యధికంగా వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారని, కలుషితమైన నీరు తాగడమే ప్రధాన కారణమని చెప్పారు. గతంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు మధ్యలోనే ఆగాయని, వాటి నుండి మురికినీరు మంచినీటి పైపులైన్లలోకి వెళ్లి ప్రజలు డయేరియా బారిన పడ్డారన్నారు. యూజిడిని పూర్తి చేయాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి పైప్‌లైన్లు లీక్ అవుతున్నా అవసరం మేరకు ఫిట్టర్లు లేరని తెలిపారు. 15 మంది ఏఈలు అవసరం అయితే 5గురు మాత్రమే పనిచేస్తున్నారని, డ్రైనేజీ పక్కనున్న మంచినీళ్ళ పైప్‌లైన్లనూ సమూలంగా మార్చాలన్నారు. నగరంలో 200 మినరల్ ప్లాంట్స్ ఉంటే అందులో ఐఎస్ఐ ప్రమాణాలతో నడిచేవి 10 కూడా లేవన్నారు. సిఎం చంద్రబాబు ఇప్పటికైనా క్వాంటం వ్యాలీ, బుల్లెట్ రైలు,


బాధితుల్ని పరామర్శిస్తున్న లక్ష్మణరెడ్డి, నారాయణరెడ్డి

బనకచర్ల ప్రాజెక్ట్ సిప్లైన్, మెట్రో రైలు, అంతర్జాతీయ అమరావతి లాంటి పెద్ద పెద్ద మాటలు ఆపి రూ.5 కోట్ల మందికి రక్షిత మంచినీరు అందించాలన్నారు. నగరంలోని రిజర్వాయర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. 2018లో 25 మంది, 2024లో ఇద్దరూ, 2025లో తురకపాలెంలో 40 మందికి పైగా పేదలు మరణించారని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. బాదితుల్ని పరామర్శించిన వారిలో ప్రొఫెసర్ టీవీ రత్నరావు, ఉగ్గం సాంబశివరావు, వల్లూరి సదాశివరావు, ఆర్.అంజిరెడ్డి, తిరుమలరావు, గోపి, జెవివి నాయకులు జి.వెంకట్రావు ఉన్నారు.

గ్యాస్ సబ్సిడీపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న జేసీ

దీపం పథకం-2లో సబ్సిడీ నగదు జమ కాని లబ్దిదారుల నుండి అందిన ఫిర్యాదులపై జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు, అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 1257 మందికి సబ్సిడీ నగదు ఖాతాలలో జమ కావట్లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, మేడికొండూరు మండలాల నుండి ఈ ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయన్నారు. ఆయా ఫిర్యాదు దారుల జాబితాను గ్యాస్ ఏజెన్సీలు , డిస్ట్రిబ్యూటర్లకు పంపాలని జిల్లా సప్లయ్ అధికారికి జేసీ సూచించారు. ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు వినియో గదారులకు ఫోన్‌చేసి వారికి ఎందుకు సబ్సిడీ నగదు జమ కాలేదో తెలియజేయాలని, బ్యాంక్‌లకు వెళ్ళి ఏ విధంగా సబ్సిడీ నగదు పొందలనే విషయాన్ని వివరించాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చే బుధవారం నాటికి పూర్తి చేయాలన్నారు. అటువంటి లబ్దిదారులకు బ్యాంకుల్లో ప్రాధాన్యత ఇచ్చి పని పూర్తి చేయాలని ఎల్‌డిఎంకు సూచించారు. ఎల్‌డిఎం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ లబ్దిదారులు ఆధార్ కార్డు, అక్కౌంట్ పుస్తకం బ్యాంక్‌కు తీసుకువెళ్ళి అక్కౌంట్ డీ లింక్ చేయించుకుని, మళ్ళీ లింక్ చేయించాల్సి వుంటుందన్నారు. కొంత మందికి ఆధార్ ఇన్ యాక్టివ్ అని వస్తుందని, వారికి పొరపాటున రెండు ఆధార్‌లు ఉంటే ఒకటి ఇవ్వాలన్నారు. మరికొందరికి ఆధార్ బ్యాంక్ ఖాతాకు లింక్ కానందున సబ్సిడీ నగదు జమ కావడం లేదని తెలిపారు. 40 మందికి ఫ్రీజ్/బ్లాక్ అని వస్తున్నదని , వీరికి లోన్లు ఉండి సకాంలో ఈఎంఐ చెల్లించకపోవటం వల్ల గానీ, ఈకె వైసీ చేయించుకోకపోవడం వలన గాని సబ్సిడీ జమ కావడం లేదన్నారు. ఇటువంటి వారు బ్యాంక్ లకు వెళ్ళి సరి చేయించుకోవాలన్నారు. పది సంవత్సరాల తరువాత ఆధార్ అప్ డేట్ చేయించుకున్న వారు గ్యాస్ ఏజెన్సీలు , డిస్ట్రిబ్యూటర్లు అప్‌డేట్ ఆధార్ వివరాలు తెలియ జేయనందున అలాంటి వారు 1031 మంది వున్నారని , వారు ఆధార్ అప్ డేట్ వివరాలు అందివ్వలన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్యాస్ డెలివరి చేసే వారు మహిళలతో అనుచితంగా ప్రవర్తించకూడదని , అధిక డబ్బు వసూలు చేయకుండా చూడాలన్నారు.

నవ సమాజ నిర్మాతలు అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు : నవ సమాజ నిర్మాణంలో అధ్యాపకులు కీలక పాత్ర పోషిస్తారని, ఒక తరం నుండి మరొక తరానికి జ్ఞాన వారదులు అధ్యాపకులని టిజెపిఎస్ కాలేజి సెక్రెటరీ, కరస్పాండెంట్ కె వి బ్రహ్మం అన్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె వి సుధీర్ కుమార్, డాక్టర్ ఏ అంజనీ కుమార్, బి.జ్యోతికి ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ టీచర్స్ అసోసియేషన్ వారు పాన్ ఇండియా ఎడ్యుకేషనల్ టీచర్స్ ఐకాన్ పురస్కరాలు ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయా అధ్యాపకులను కళాశాల సెక్రెటరీ కె.వి.బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్ కామేశ్వరశాస్త్రి అభినందించారు. కార్యక్రమంలో పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకుల్ని అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్స్